రీతిక కథ

# కథ కాదిది

మొవ్వ. బాబూరావు



నమస్కారం......

నన్ను ప్రసాదమంటారు. నేను ఐ.యి.ఎస్.లో అంటే ఇండియన్ ఇంజనీర్ సర్వీసులో ఫస్ట్ర్యాంక్‌లో పాస్ అయినందుకు ప్రభుత్వం వారు టెలిఫోన్ శాఖలో నన్ను అసిస్టెంట్ ఇంజనీర్‌గా డైరక్ట్ రిక్రూట్ చేసారు.

ఈ కాలంలో మగాడి వయస్సు చెప్ప కూడదంటారు గాని నేను చెప్పేస్తున్నాను. నా వయస్సు పాతికకి చేరుకోవటానికి ఇంకా రెండంటే రెండేళ్ళు ఉంది.... ఇక పోతే.... నా ఫామ్లీ బ్యాక్ గ్రౌండ్ నాకు ఒక అక్కయ్య..... ఇద్దరు చెల్లెళ్లు.

అమ్మా, నాన్నలకి పిల్లలందరిలో నేనంటేనే ఎక్కువ ఇష్టం. ఒక్కణ్నే కొడుకుని కదండి.... పైగా ఇంజనీర్‌ని.

నేనింతటి వాణ్ని కావటానికి కారణం వాళ్ళ దీవెనలే అని వేరుగా చెప్పనక్కర్లేదు. నా మీద పెట్టిన ఖర్చుకి పదింతలు లబ్ధి పొందవచ్చనే భావన వాళ్ళకి నా చిన్నప్పటి నుంచే ఉంది. అందుకనే నన్ను వికాస్ పత్రంలా అతి మురిపెంగా పెంచారు. వాళ్ళ ఆశయాలకి, కోరికలకి అనుగుణ్యంగా నేనూ అన్నిట్లో ఫస్ట్‌గా వచ్చి ప్రయోజకుడి నయ్యాను.

అసలు ఆస్తులంటేనే మన ప్రజానీకానికి ముందుగా గుర్తుకొచ్చేవి కొడుకులూ... ఇళ్ళు... స్థలాలు... వీటికి ఏప్రిషియేషనే కాని డిప్రిషియేషన్ అనే మాట వర్తిస్తుందంటే మీరు ఒప్పుకుంటారా!

మా నాన్నగారు చార్టెడ్ ఎక్కౌంటెంట్ కాకపోయినా, ఎక్కౌంట్స్‌లో వాళ్ళని తలదన్నే దిట్టండోయ్. మా అమ్మ పెద్దగా చదువుకోకపోయినా మానాన్న కన్నా తెలివి తేటల్లో రెండాకులు ఎక్కువే ఇంట్లోనూ - అన్నింట్లోనూ


విద్యార్హతల్లోనే కాదు. నాకు ఇంకా చాలా విషయాలలో ప్లస్ పాయింట్స్ ఉన్నాయి. వాటిల్లో అతిముఖ్యమైనది నా ఫేస్ వ్యాల్యూ. నన్ను చూసిన ప్రతివాడికి నన్నెక్కడో చూసినట్లు అన్పిస్తుందిట. బహుశా సినిమా హీరోలకి, నాకూ దగ్గిర పోలికలుండటమే కారణం కావచ్చు.


కొందరికి అన్నీ బావున్నా ఎక్కడో అక్కడ లోటు కలగచేస్తాడు ఆ విధాత..... చంద్రుడి విషయంలోనే తప్పలేదు.

కాని నా విషయంలో అలాంటిదేమీ లేదు. బహుశా భగవంతుడు నా బొమ్మని తయారు చేస్తున్నప్పుడు ఆ విషయం పూర్తిగా మర్చిపోయి ఉండొచ్చు.

ఇన్నేసి అర్హతలున్న నేను కాబోయే పెళ్ళికొడుకుని... ఇంతకన్నా విలువైనది ఏముంటుంది చెప్పండి. ఈ సువిశాల ఆంధ్ర దేశంలో.

మీరు నమ్ముతారో నమ్మరో గాని రోజూ మా ఇంటిముందు ఉన్న "క్యూ" చూస్తే చిరంజీవి కొత్త సినిమాని మా






ఇంట్లోనే చూపిస్తున్నారేమో అన్న అనుమానం రాక తప్పదు. అమ్మానాన్నలు వచ్చిన వాళ్ళని ఎలా వదిలించుకుంటున్నారో, విదిలించుకుంటున్నారో ఆ పరమాత్ముడికే ఎరుక. పెళ్ళి కొడుకుల జాబితాలో నా పేరు జాబిలిగా ప్రకాశిస్తోంది.

ఆంధ్రదేశంనుంచే కాక, దేశం నలుమూలల నుంచి కూడా నన్ను అల్లుడ్నిగా చేసుకుందామనే వచ్చేవారి సంఖ్య చూస్తుంటే దేశ జనాభాలో సగంమంది ఆడపిల్లల తండ్రులే ఉంటారేమో? ఎంతమంది ఎన్ని విధాల విశ్వప్రయత్నం చేస్తున్నా నన్ను ఎవరూ కొనుక్కోలేకపోతున్నారు. కారణాలు లేకపోలేదు. నేను చుక్కల్లో చంద్రుడ్ని. మా వాళ్ళ దృష్టిలో నన్ను అందుకోవాలంటే స్వర్గానికి నిచ్చెనలు వేసినట్లే.

ప్రస్తుతం మార్కెట్లో ఉన్న డిమాండ్‌ని బట్టీ నారేటు ఐదులక్షలని ఖరారు పరిచారు. మా కుటుంబ సభ్యులు. అక్కడికి నాన్న బలవంతం మీద అతి కష్టంతో అమ్మ నా రేటుని ఆరులక్షల నుంచి ఐదు పలికించటానికి ఒప్పుకుంది. అంటే కట్నాల రేట్లలో కూడా డిస్కౌంట్ అనే పద్దతి నాతోనే ప్రారంభం అయిందని చెప్పాలి.

ఇటు బంధువర్గంలోనూ - అటు మిత్రబృందంలోనూ నన్ను "అమ్మ కూచీ - నాన్న కూచీ" అని ఎగతాళి పట్టించేవాళ్ళు చాలామంది ఉన్నారు. అందులో వాళ్ళ తప్పేంలేదని అనిపిస్తూఉంటుంది. ఎందుకంటే వాళ్ళన్నది నిజం కాబట్టి. అలా అని మరీ ఎక్కువగా నన్నూ ఎద్దేవ చేస్తే నాకు కోపం వచ్చేస్తుంది. ఎందుకంటే మనిషిగా నాకూ కొన్ని ఆశయాలు, ఆదర్శాలు ఏడ్సాయి కాబట్టి.

ఇంతకీ అవేమిటో మీకు చెప్పకపోతే బావుండదు కదూ! సిగ్గుపడకుండా చెప్పాలో, సిగ్గుపడుతూ చెప్పాలో నాకు తెలీటం లేదు - కానీ ఏదో విధంగా చెప్పేస్తున్నాను.

కట్నం లేకుండా పెళ్ళి చేసుకుని ఒక ఆదర్శవాదిగా సంఘంలో నిలవాలని, ఒకరి కన్నా ఎక్కువమంది పిల్లల్ని కనకూడదని (కనేది మా ఆవిడేలెండి..) రెండో బిడ్డగా ఓ అనాధని పెంచుకోవాలని.... ఇలాంటివి రెండుమూడు కోరికలే అనండి ఆశయాలే అనండి... ఉండేవి.

రెక్కలపై బ్రతికే పక్షికి, మనిషికి ఒకటే భేదం. పక్షి ఆకాశంలో తిరుగుతూ భూమ్మీద జీవిస్తుంది. మనిషి ఆకాశంలో జీవిస్తూ భూమ్మీద తిరుగుతాడు.

అమ్మా నాన్నల చిరకాల వాంఛలు విన్న తరువాత నా ఆదర్శాలు, ఆశయాలు నెరవేరనివి అని నేను నిర్ధారించేసుకున్నాను. ఆదర్శాలు ఆశయాలు అనుకోవటానికే గాని ఆచరణ యోగ్యాలు కానివని నన్ను నేనే సమర్థించుకోక తప్పింది కాదు.

అక్కయ్య వయస్సులో నాకన్నా రెండేళ్ళు పెద్దది. ఇంకా పెళ్ళికాలేదు. కూతురు పెళ్ళికి లక్షలు కుమ్మరించే స్థితిలో లేరు నా తల్లితండ్రులు. నా తరువాత ఇద్దరు చెల్లెళ్ళు - పెళ్ళి చేసుకోవటానికి మాదేం ఆలస్యం లేదని త్వరత్వరగా రెడీ అయిపోతున్నారు. వీళ్ళందరి పెళ్ళిళ్ళు జరగాలంటే ముందు నా పెళ్ళి కావాల్సిందే. నాకొచ్చిన కట్నంతో ముగ్గురి పెళ్ళిళ్ల చందమామ కథల్లో మహారాజులు చేసినట్లు ఒకే పందిరిలో చేయాలనే వ్రతకల్పం - సంకల్పం మా పెద్దలది. నేను చదివిన చదువుకి, చేస్తున్న ఉద్యోగానికి సార్థకత మావాళ్ళు తీసుకునే కట్నమే అని నేను "ఉంగా... ఉంగా..." అంటున్న రోజుల్లోనే నిర్ధారించారట.

అక్కడికీ నేను ఎంతో మొరాయించాను. నా కోరికల్ని సూక్ష్మంగా కంద పద్యంలా వల్లించాను. అంతే... ఇంటిల్లపాది మూకుమ్మడిగా తాళ్ళు పట్టుకొచ్చేసారు ఉరి బిగించేసుకుంటామని.

అంటే నా ఆదర్శాలని నేను ఆచరణలో పెడితే వీళ్ళందరూ సజీవంగా ఆత్మహత్యలు చేసేస్కుంటారన్నమాట. నాలో ఎక్కడో అలజడి... భయం..

"ఛ! ఊరికనే అన్నాను. మీరు నిజం అని కంగారు పడుతున్నారు. నేనన్నది అనుకోవటానికేగాని ఆచరణ పర్పస్‌కి కావు" అని సస్పెన్స్‌ని తొలగించిన ఘనత నాకుంది.

మొత్తానికి ఎలాగైతే ఓ బిజినెస్ మ్యాగ్నెట్ కూతురు నాకు మొగుడైంది.... సారీ భార్యగా లభించింది.

లక్షకి ఒక బంగారు బిస్కెట్టు చొప్పున ఐదు బిస్కెట్లని మా మొహాన కొట్టారు.

స్వరూపం ఒకటే అయినా భావనలలో తేడా ఉంటుందంటే ముందు నేను నమ్మేవాడ్ని కాను.

నా అత్తమామల దృష్టిలో వాళ్ళు మాకు పారేసినవి కుక్క బిస్కెట్లు - కాని మా ఇంట్లో వాళ్ళ దృష్టిలో అవి మాకు అదృష్టవశాత్తు లభించిన లంకెబిందెలు.

నా పెళ్ళయిన రెండు నెలల్లోనే అక్కయ్య పెళ్ళి ఘనంగా చేసాం. అది ఇప్పుడు ఓ గొప్పింటి కోడలు.

తెలుగు వాళ్ళకి ఉన్నన్ని పండుగలు, పబ్బాలు దేశంలో మరెవరికీ ఉండవేమో?

ప్రతి పండక్కి అక్కయ్య బావలు మా ఇంటికి రావటం బజారులో కొత్తగా ఏ వస్తువు వచ్చిందో కనుక్కొని, మరీ కొనుక్కొని - సారీ అమ్మా నాన్నల చేత కొనిపించుకుని అత్తారి ప్రేమకి పాత్రురాలవటం రివాజయిపోయింది.

అత్తారింటినుంచి అబ్బాయి పాలథిన్ సంచీలలో కూడా నోట్ల కట్టల్ని తీసుకురాగలడనే నా తల్లితండ్రుల నమ్మకాన్ని, ధైర్యాన్ని నేను కాదనలేకపోయాను.

నా భార్య ఐశ్వర్యపుత్రిక ఇది గమనించటంలో పెద్ద ఆశ్చర్యపోనవసరంలేదు.

కూతురి సిఫార్సుతో నా బిజినెస్ మ్యాగ్నెట్ మామగారు నన్ను చటుక్కున చెప్పా చేయకుండా హాయిగా బంగారు పంజరంలో పడే ఉండమని వాళ్ళింటికి తీసుకుపోయారు.

ఇప్పుడు నేను ఇల్లరికపుటల్లుడ్నయ్యాండోయి. చూసారా నా పొజిషన్ ఎంత

పెరిగిపోయిందో. లేకపోతే ఏమిటి చెప్పండి..

ఇప్పుడు నేను ఎటు చూసినా నాకు కనిపించేవి డబ్బు... డబ్బు.... డబ్బా..... నా బ్యాగ్ నిండా చెక్కుబుక్కులే. ఎటొచ్చీ వాటిని వాడుకోవాలంటే మా ఆవిడ పర్మిషన్ దొరికితే చాలు.... అంతే!!!

ఎక్కడున్నా పిల్లాడి సుఖమేకదా మాకు కావాల్సింది. వాడు ఏ పంజరంలో ఉన్నా మాకు అవసరమైన డబ్బు అందిస్తే ఈ జీవితాలకి కావల్సింది అంతకన్నా ఏముంది అని సరి పెట్టేసుకున్నారు జన్మనిచ్చిన నా జననీ జనకులు. నేను అత్తారింటికి వచ్చినంత మాత్రాన అక్కయ్య బావతో సహా పుట్టింటికి రాకమానుతుందా... తెలుగు పండగలు నిండుకుంటాయా?

ఈ మధ్యన కోడలి పుట్టింటినుండీ వచ్చే కోటా తగ్గిపోతుందని అక్కయ్య అత్తామామలు తెగకలవరపడిపోయి టెంపరరీగా అక్కయ్యని పుట్టింటికి పంపించేసారు ఖబడ్దారు అంటూ... అక్కయ చెప్పిందాన్ని బట్టి చూస్తే రేషన్లో కిరసనాయిల్ కొనుక్కుని రెడిగా పెట్టింది ఎప్పటికైనా వాళ్ళకి ఉపయోగపడుతుందనే ఉద్దేశ్యంతోనేనట.

అక్కయ్య చెప్పిన ఎపిసోడ్ వినగానే అమ్మా, నాన్నలు నా దగ్గిరకి పరిగెత్తుకుంటూవచ్చారు. నేను అంత స్పీడుగానే పరిగెత్తి వెళ్ళవలసిన వాళ్ళ దగ్గిరికి వెళ్ళి వాళ్ళు నలిపి పారేసి అసహ్యంగా విసిరేసిన కుక్క బిస్కెట్లన్ని అపురూపంగా తీసుకొచ్చి అక్కయ్య సమస్యని తాత్కాలికంగా పరిష్కరించాను.

కాలం గడిచిపోతుంది తెలుగు సినిమారీళ్ళలా!

ఐదు లక్షలకే సలక్షణమైన అల్లుడ్ని కొనుక్కున్నమనే గర్వంతో తెగ మురిసిపోతుంటారు నా అత్తమామలు.

తన కాలు క్రింద పెట్టకుండా ఆచ్చు దానికై భర్త అనే మూవింగ్ ఎనిమల్ ఒహటుందనే దర్పం మా ఆవిడ "ఐశ్వర్యపుత్రిక" నరనరాలలో జీర్ణించుకుపోయింది.

వియ్యాలవారు బిర్లా, టాటాలకి ఏమాత్రం తక్కువ చేయరని నా అదృష్టాన్ని తలుచుకుంటూ మురిసిపోతుంటారు నా తల్లితండ్రులు.

అక్కయ్యకే అంతమంచి సంబంధం చేసాడు. ఇక ముద్దుల చెల్లెళ్ళం - మా పెళ్ళిళ్ళు మరెంత భారీగా జరిపిస్తాడో అని కలవరించిన చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు వారు కలలో కూడా ఊహించని దానికన్నా ఎంతో వైభవంగా జరిపించాను.

మా పుట్టింట్లో కుక్క బిస్కెట్లక్కొదవలేకుండా చేస్తున్నాను. జీవితం అలా నడిచిపోతోంది....

.........

.........

తను కరిగిపోతూ పదిమందికి వెలుతురిస్తుంది కొవ్వొత్తి అది దాని సహజగుణం.

సామాన్యంగా మన రచయితలూ, రచయిత్రులు స్త్రీ జీవితాన్ని కొవ్వొత్తిలా పోల్చి పుంఖాను పుంఖాలుగా రచనలు చేసారు. అవి ఎంతోమంది పాఠకులని ఆకట్టుకున్నాయి. లక్షలాది మంది పాఠకురాళ్ళు ఇటువంటి కథలని, సినిమాలని చూసి కళ్ళొత్తుకున్నారు.

ఆడవాళ్ళనే కాదు. నా లాంటి మగాళ్ళని కూడా అలా ఎందుకు పోల్చరో? మధ్య తరగతి కుటుంబాలలో ఇటువంటి కొవ్వొత్తులు ఎన్నో ఉన్నాయి. వీటి ద్వారానే కారు చీకట్లలోనుంచి వెలుగుదారులు వెతుక్కుని ఎందరో తమ తమ జీవితాలని నందనవనం చేసుకుంటున్నారు.

వరకట్నాల రేట్లు ఆకాశానికి అంటుతున్నాయంటున్నారు. నిజమే! కాని వాటికి కారణాలు అనేకం... వాటిలో నాలాంటివి ఎన్నెన్నో!!

నేను ఆదర్శాలంటు, ఆశయాలంటూ మడిగట్టుకుని కూర్చుని కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకుంటే నా వలన ఎన్నో జీవితాలు నాశనమయ్యేవి.

సరిగ్గా ఆలోచిస్తే కట్నం తీసుకున్నానని నేను సిగ్గుపడవలసిన అవసరం లేదనిపిస్తోంది. అది అవినీతి కూడా కాదనిపిస్తోంది. ఎందుకంటే నేను అమ్ముడు పోయింది ఒక కోటీశ్వరుడికి.

కట్నం విషయంలో ఒక ఆడదానికి నిజంగా నేను అన్యాయం చేసానంటే మరో ముగ్గురి విషయంలో న్యాయం చేసాను. ఎటు చూసినా నేను చేసింది ఒక గొప్ప ఘనకార్యమే! నాకు తెలియకుండానే నేను స్త్రీ జనోద్ధరణ చేసానని ఘంటా పథంగా వేటినైనా గుద్ది చెప్పగలను.

నాకిప్పుడు ఎంతో సంతోషం.. ఏదో అనిర్వచనీయమైన ఆనందం.... ఏదో సాధించాననే గర్వం... కాని కాని... లోకం దృష్టిలో నేను ఐశ్వర్యవంతుడైన అందమైన ఆఫీసర్ని. నా భార్య ఐశ్వర్య పుత్రిక దృష్టిలో నేనో పెద్ద నౌకర్ని. .. మరి నా విషయంలో నేనేమిటో మీరు చెప్పగలరో లేదో కంచికి చేరిందే కథైతే చేరనిది వాస్తవం.


ఆ వాస్తవం ఏమిటో మీకు చెప్పోద్దూ...

ప్రాణికోటి అంతటిలోను మనిషి ఒక్కడికే సిగ్గుపడటం చేతనవుతుందట. ఆ అవసరం కూడా మనిషి ఒకడికే ఉందిట. కాని నా విషయంలో నేను అలా అనుకోవటం లేదు.

●

# మనిషి వాసన

--జియో లక్ష్మణ్



రెండు చేతుల్లోకి ఆ
ముఖాన్ని తీసుకుంటాను
అక్షరాన్ని పొదగటం తెలిసిన
వాడిని కదా
చక్కగా ఒంగుతుంది ముఖం
భావానికి అనుగుణంగా
చర్మం లోతుల్లోకి వెళితే
అందం కన్పడదు
జీవగుణం తొణికిసలాడుతుంది
కళ్లు పూర్వీకుల తత్వాన్ని
చాటి చెబుతుంటాయి
మనిషి దృఢత్వం కంటే
మనసు దృఢత్వం బాగా ఆకట్టుకుంటుంది
చేతుల్లోని ముఖం అటు ఇటు
జారిపోయి
పేరులేని లోకాల్లో సంచరిస్తూ
ఉంటుంది
ఇంత అందమైన ముఖం
ఒక పుర్రెకు తోలు అలంకారమా?
విచిత్రంగా లేదూ
కౌగిలించుకోబోతున్న ఆ
అందమైన బాహువులు
కదిలే ఎముకల శబ్దాల లయ
విన్యాసాలా?
రక్తంలో స్పందించే హృదయం
నా ప్రతిబింబమై నన్ను
చూపిస్తుందేమిటి?
మనిషికి మనిషే ఆహ్వానం కదా
మనిషి రూపం మనుషుల్లోనే
వెదుక్కోవాలి
నా మెడకి అదే ముఖం
అదే మనిషి వాసన ●



2-b